

ఎక్కడ చూసినా చెత్తే!

కార్మికుల సమ్మెతో క్షీణిస్తున్న పారిశుధ్యం

- కంపుకొడుతున్న పట్టణాలు
- అనకాపల్లి, నర్సీపట్నంలో పది రోజుల నుంచి పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- ఎలమంచిలిలో రెండో రోజుకు చేరిన సమ్మె



నర్సీపట్నం బొంతువీధి రోడ్డు ప్రవేశ మార్గంలో పేరుకుపోయిన చెత్త

అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం/ ఎలమంచిలి, జనవరి 4: మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో పారిశుధ్యం రోజు రోజుకీ క్షీణిస్తున్నది. వీధుల్లో చెత్త కుప్పలు పెరిగిపోతున్నాయి. నర్సీపట్నం, అనకాపల్లిల్లో పారిశుధ్య కార్మికులు పది రోజులుగా సమ్మె చేస్తుండడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. నర్సీపట్నంలో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల పది రోజుల్లో ఒక్కసారి కూడా చెత్తను తొలగించకపోవడంతో కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని, పరిస్థితి ఇలాగే వుంటే అంటువ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో పూడిక పేరుకుపోయి దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. కాగా సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రిలే దీక్షలను కొనసాగిస్తున్నారు. అబీద్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. అనకాపల్లిలో సగం మంది రెగ్యులర్ కార్మికులు విధుల్లో వుండడంతో ప్రధాన రహదారుల్లో మాత్రమే పారిశుధ్య పనులు జరుగుతున్నాయి. వీధుల్లో చెత్తను తొలగించడంలేదు. కాగా పట్టణంలో సేకరించిన చెత్తను జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్దకు తరలించి, ఇక్కడి నుంచి డంపర్ల ద్వారా కాపులుప్పాడ పంపుతుంటారు. కానీ బుధవారం రాత్రి సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు డంపర్ లారీలను అడ్డుకోవడంతో చెత్త తరలింపు ఆగింది.



జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్త

ఎలమంచిలిలో..



ఎలమంచిలి బజారు వీధిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

ఎలమంచిలి మునిసిపాలిటీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. మునిసిపాలిటీలో మొత్తం 92 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య సిబ్బంది వుండగా వీరిలో 78 మంది సమ్మె చేస్తున్నారు. దీంతో వీధుల్లో చెత్త తొలగించకపోవడంతో గుట్టలుగా పేరుకుపోతున్నది. పట్టణంలో రోజూ సుమారు 16 టన్నుల చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకి తరలిస్తుంటారు. రెండు రోజుల నుంచి 85 శాతం మంది పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో మిగిలిన 12 మంది మెయిన్ రోడ్డు, మార్కెట్ వీధుల్లో మాత్రమే పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని మిగిలిన ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతున్నది. ఇంటింట చెత్త సేకరణ నిలిచిపోవడంతో ఇళ్లలో చెత్త డబ్బాలు నిండిపోతున్నాయి. దీంతో ప్రజలు వీధుల్లో, డంపర్ బిన్‌ల వద్ద చెత్తను పడేస్తున్నారు. ఇది కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది.

వైసీపీ పేట సమన్వయకర్తకు చేదు అనుభవం

తంగేడు రాజుల ఆధిపత్య పోరుతో ఇరకాటంలో పడిన ఎమ్మెల్యే కంబాల జోగులు

- కోటవురట్లలో పింఛన్ల పంపిణీకి పర్యటన ఖరారు
- తమ ఇళ్లకు రావాలని డీవీఎస్, సీతబాబు వేర్వేరుగా ఆహ్వానం
- తొలుత డీవీఎస్ నివాసానికి, తరువాత సీతబాబు ఇంటికి వస్తానని ఎమ్మెల్యే వెల్లడి
- దారిలోనే అడ్డుకుని సీతబాబు ఇంటికి తీసుకెళ్లిన ఆయన తనయుడు
- జోగులుకు ఫోన్‌చేసి.. సరైన పద్ధతి కాదంటూ డీవీఎస్ అసంతృప్తి
- అనంతరం డీవీఎస్ ఇంటికి వచ్చిన జోగులు.. రావద్దంటూ అనుచరులు నినాదాలు



సూర్యనారాయణరాజు ఇంటి వద్ద జోగులను అడ్డుకున్న ఆయన అనుచరులు



సీతబాబు ఇంటివద్ద నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల, జనవరి 4: పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకు కోటవురట్ల మండల పర్యటనలో తొలి రోజే చేదు అనుభవం ఎదురైంది. సొంత పార్టీకే చెందిన మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతారామరాజ అలియాస్ సీతబాబులు.. ఎమ్మెల్యే కంబాల జోగులు పర్యటనను తమ ఆధిపత్య పోరుకు వేదికగా చేసుకోవడానికి ప్రయత్నించారు. దీంతో జోగులు ఇరకాటంలో పడాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును పార్టీ అధిష్ఠానం రెండు రోజుల క్రితం నియమించిన విషయం తెలిసిందే. నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేతలను కలిసి, పరిచయం చేసుకోవడానికి బుధవారం ఎస్.రాయవరం మండలానికి వచ్చారు. గురువారం కోటవురట్ల ఎంపీడీవో కార్యాలయంలో సంక్షేమ పింఛన్ల పంపిణీ కోసం ఆయన పర్యటన ఖరారైంది. ఈ విషయం తెలుసుకున్న తంగేడు గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతబాబు తమ ఇళ్లకు ఆహ్వానించారు. తొలుత సూర్యనారాయణరాజు ఇంటివద్ద కార్యకర్తలతో పరిచయం, పింఛన్లు పంపిణీ చేసి అనంతరం సీతబాబు ఇంటి వద్ద మధ్యాహ్నం విందుకు హాజరుకావాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఇరువురు నేతలకు సమాచారం ఇచ్చారు. ఎమ్మెల్యే జోగులు నర్సీపట్నం నుంచి తంగేడుకు ... మిగతా 8వ పేజీలో

24వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. అన్ని కేంద్రాల్లో నిరసన శిబిరాలను కొనసాగిస్తున్నారు. గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ నెల 5వ తేదీలోగా విధుల్లో చేరాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను పరవాడలో దహనం చేశారు. దేవరాపల్లిలో మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు.

హామీలు విస్మరించడం సీఎంకు తగదు

సమగ్ర శిక్ష ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు దుర్మార్గం



డీఈవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

- వచ్చే ఎన్నికల్లో వైసీపీ తగిన మూల్యం చెల్లించుకుంటుంది
- ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణ

- 7లో

ఘరానా దొంగ అరెస్టు

తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

- జిల్లాలో ఇరవై ప్రాంతాల్లో పట్టపగలు చోరీలు
- రెండుసార్లు అరెస్టు, సెంట్రల్ జైలుకు తరలింపు
- కోర్టు వాయిదాలకు తీసుకొచ్చిన ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి పరారీ
- తాజాగా మూడోసారి అరెస్టు చేసిన పరవాడ పోలీసులు
- 22 తులాల బంగారు ఆభరణాలు, రూ.2,500 నగదు స్వాధీనం



విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ (క్రైమ్) పి.సత్యనారాయణరావు. పక్కన డీఎస్పీ, సీఐలు (ఇన్‌సెట్‌లో) నిందితుడు పిల్లా నూకరాజు

పరవాడ, జనవరి 4: అనకాపల్లి జిల్లాలో సుమారు ఇరవై ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి, రెండుసార్లు పోలీసు ఎస్కార్ట్ కళ్లుగప్పి పరారైన పాత నేరస్థుడిని పరవాడ పోలీసులు పట్టుకున్నారు. ఇతని నుంచి 22 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) పి.సత్యనారాయణరావు గురువారం పరవాడ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

పరవాడ మండలం మంత్రిపాలెంలో కె.మహేశ్వరి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. గత నెల ఏడో తేదీన భర్త మోహన్‌రెడ్డితో కలిసి ఉదయం ఏడు గంటలకు విజయనగరం బయలుదేరి వెళ్లారు. తరువాత వీరి ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్లిపోయారు. దంపతులిద్దరూ అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. తలుపు తాళాలు పగులగొట్టి వుండడంతో చోరీ జరిగిందని ఆందోళన చెందారు. బీరువాలో భద్రపరిచిన అర తులం బంగారు చెవి రింగులు, రెండు జతల వెండి పట్టీలు, రూ.8,500 నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. చోరీకి పాల్పడిన వ్యక్తి పిల్లా నూకరాజు అనే పాత నేరస్థుడిగా గుర్తించారు. అప్పటి నుంచి అతని కోసం గాలిస్తున్నారు.

రెండుసార్లు ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి పరారీ

చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్లా నూకరాజు దొంగతనాలు చేయడమే వృత్తిగా పెట్టుకున్నాడు. పగటిపూట గ్రామాల్లో తిరుగుతూ తాళాలు వేసి వున్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల కాలంలో అనకాపల్లి జిల్లాలో పరవాడ, సబ్బవరం, రావికమతం, కె.కోటపాడు, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, ఎస్.రాయవరం, చీడికాడ మండలాల్లో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు. ఎస్.రాయవరం మండలంలో ఒక చోరీ కేసులో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. కొద్ది రోజుల తరువాత కేసుకు సంబంధించి కోర్టులో హాజరుపరచడానికి పోలీసులు ఎస్కార్ట్ వాహనంలో ఎలమంచిలి తీసుకువచ్చారు. బస్‌స్టేషన్‌లో టాయిలెట్‌కు వెళ్తానని చెప్పి పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. అనంతరం నవంబరు ఏడో తేదీన నూకరాజును పోలీసులు అరెస్టు చేసి మళ్లీ విశాఖ సెంట్రల్ జైలుకు ... మిగతా 8వ పేజీలో

మళ్లీ మళ్లీ అదే పాట!

ప్రకటనలకే పరిమితమైన గోవాడ రైతులకు చెరకు బకాయిల చెల్లింపు

- మూడు నెలల్లో రెండు జీవోలు జారీ చేసిన ప్రభుత్వం
- రైతుల ఖాతాలకు డబ్బులు జమ అవుతాయంటూ ప్రజాప్రతినిధులు హడావుడి
- ప్రభుత్వ తీరుపై రగిలిపోతున్న చెరకు రైతులు





గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, జనవరి 4: గోవాడ చెరకు రైతులకు, కార్మికుల వేతన బకాయిలకు రూ.12.5 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందంటూ అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలను వినీవినీ అటు రైతులు, ఇటు కార్మికులు విసుగెత్తిపోయారు. చెరకు రైతుల బకాయిల చెల్లింపునకు నిధుల కోసం స్థానిక ఎమ్మెల్యే అయిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, గోవాడ షుగర్స్ ఎండీ... అమరావతి చుట్టూ మూడు నెలల నుంచి ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కరుణించడంలేదు. దీంతో చెరకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరుకు మూడు నెలల్లో రెండు జీవోలు జారీ అయ్యాయిగానీ, రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడలేదు. ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు బకాయిలు జమ అవుతాయని ప్రభుత్వ విప్ అంటున్నప్పటికీ నిధులు విడుదలయ్యే పరిస్థితి కానరావడలేదని అంటున్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో గత క్రషింగ్ సీజన్‌లో 2 లక్షల 21 వేల 246 టన్నుల చెరకు క్రషింగ్ జరిగింది. టన్నుకు రూ.2821.25 చొప్పున మొత్తం రూ.62.41 కోట్లు రైతులకు చెల్లించాలి. కానీ టన్నుకు రూ.2,500 చొప్పున రూ.55.26 కోట్లు మాత్రమే రైతులకు అందాయి. ఇంకా టన్నుకు రూ.321 చొప్పున మొత్తం రూ.7.1 కోట్లు, చెరకు రవాణా చార్జీల రూపంలో మరో రూ2 కోట్లు.. మొత్తం రూ.9.1 కోట్లు రైతులకు చెల్లించవలసి ఉంది. కార్మికులకు మూడు నెలల వేతనాల బకాయిలతోపాటు, ఫ్యాక్టరీ ఓవర్ హాలింగ్ పనులకు చేసిన ఖర్చులకు చెల్లింపులు జరపాల్సివుంది.

మూడు నెలలుగా ప్రకటనలే....

గోవాడ చెరకు రైతులకు బకాయిలతోపాటు కార్మికుల వేతనాల కోసం ప్రభుత్వం రూ.12.5 కోట్లు విడుదల చేసిందని, రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు జమ అవుతాయని గత ఏడాది సెప్టెంబరు 29న షుగర్ ఫ్యాక్టరీ మహాజన సభలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రకటించారు. రోజులు, వారాలు గడిచినా నిధులు విడుదల కాలేదు. తరువాత గోవాడ చెరకు రైతుల బకాయిలు, కార్మికుల వేతనాలకు నిధులు మంజూరు చేస్తున్నట్టు నవంబరు 16న పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జీవో 189 జారీ చేశారు. దీంతో బకాయిలు కచ్చితంగా అందుతాయని రైతులు భావించారు. అంతేకాక వైసీపీ నేతలు, కార్మికులు కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. నిధులు మాత్రం విడుదల కాలేదు. దీంతో ధర్మశ్రీ, ఫ్యాక్టరీ ఎండీ పలుమార్లు అమరావతికి వెళ్లివచ్చారు. డిసెంబరు 28న ఆర్థిక శాఖ నుంచి నిధుల విడుదలకు సంబంధించి మరో జీవో 3553 జారీ అయింది. ఆర్థిక శాఖ నుంచి జీవో వచ్చింది కాబట్టి ఇక నిధులు వచ్చేసినట్టే అని భావించారు.

మళ్లీ షరా మామూలే! రైతుల ఖాతాలకు డబ్బులు జమకాలేదు. మళ్లీ ఆర్థిక శాఖ నుంచి పరిశ్రమల శాఖకు నిధులు బదలాయిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి పేరిట ఈ నెల 2న పరిశ్రమల శాఖ కార్యదర్శి వాణిమోహన్ పేరిట మరో జీవో 215 జారీ అయ్యింది. ఇక నిధులు కచ్చితంగా వచ్చినట్టేనని భావించారు. కానీ రైతుల ఖాతాలకు మాత్రం డబ్బులు జమకాలేదు.

ఎప్పుడు జమ అవుతాయో ఫ్యాక్టరీ అధికారులు సైతం చెప్పడంలేదు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కొద్ది రోజుల నుంచి చెరకు బకాయిల నిధుల ఊసెత్తడంలేదు. చెరకు రైతులు మాత్రం ప్రభుత్వ తీరుపై అసంతృప్తితో రగిలిపోతున్నారు.

20 మంది సీఐల బదిలీలు

- ఎన్నికల నేపథ్యంలో ఒకేచోట మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న వారికి స్థానచలనం

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌లో 20 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ఒకేచోట మూడేళ్లకు మించి పనిచేస్తున్న సీఐలకు స్థానచలనం కల్పించారు. ఇంకా సొంత జిల్లాల్లో ఉండకూడదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తూ రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు రొక్కం రవిప్రసాద్, జి.రాంబాబు, సీహెచ్ శ్రీధర్‌లను విశాఖ నగరానికి కేటాయించారు. అలాగే జి.దేముళ్లను శ్రీకాకుళం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, వై.మురళీరావును విజయనగరం జిల్లా ఎస్.కోట యూపీఎస్‌కు, సీహెచ్ షణ్ముఖరావును ఎస్.కోట సర్కిల్‌కు, ఎన్వీ ప్రభాకరరావును గజపతినగరం సర్కిల్‌కు నియమించారు. అలాగే పి.రమణను అనకాపల్లి జిల్లా సబ్బవరం, టీసీహెచ్ స్వామినాయుడిని కె.కోటపాడు, నల్లి సాయిని శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సీఐలుగా నియమించారు. విశాఖ సిటీలో పనిచేస్తున్న సీహెచ్ సూరినాయుడిని శ్రీకాకుళం డీసీఆర్‌బీకి, ఎం.అవతారాన్ని శ్రీకాకుళం ట్రాఫిక్‌కు, టి.ఇమ్మాన్యుయల్ రాజును శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. శ్రీకాకుళం ట్రాఫిక్‌లో పనిచేస్తున్న టి.కామేశ్వరరావు, ఎస్.కోట సీఐ ఎస్.బాలసూర్యారావు, అనకాపల్లి జిల్లా కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్, సబ్బవరం సీఐ పి.రంగనాథంలను విశాఖ రేంజ్‌కు సరండర్ చేశారు.

గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడిని అనకాపల్లి జిల్లా కొత్తకోట, పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబును కశింకోట సీఐలుగా, అనకాపల్లి జిల్లాలో ఉన్న కె.కుమార్‌స్వామిని అక్కడే సోషల్ మీడియా సైబర్‌సెల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

నేడు విశాఖలో నారా భువనేశ్వరి పర్యటన

- చంద్రబాబునాయుడు అరెస్టయినప్పుడు మనోవేదనతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- ఆర్థిక సాయం పంపిణీ



విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి శుక్రవారం విశాఖ నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబు నాయుడిని ప్రభుత్వం అకారణంగా అరెస్టు చేసి జైలులో పెట్టడాన్ని తట్టుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటిస్తున్న భువనేశ్వరి గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నోవాటెల్ హోటల్ నుంచి బయలుదేరి తొలుత దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 31వ వార్డులో గల వెంకటేశ్వర మెట్ట ప్రాంతంలో మృతిచెందిన ఎ.చిన్నా కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. ఆ తరువాత 10.30 గంటలకు జ్ఞానాపురంలో ఎం.రమణ ఇంటికి వెళ్లి అతని కుటుంబాన్ని కలుసుకుంటారన్నారు. అక్కడ నుంచి బయలుదేరి 10.55 గంటలకు విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని తాటిచెట్లపాలెంలో పి.కనకారావు కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. అనంతరం 11.35 గంటలకు గాజువాక నియోజకవర్గ పరిధిలోని 65వ వార్డులో కె.వెంకటరావు, ఉప్పలపాటి సరోజిని, షీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణ (తెలుగుదేశం బాబాయ్)ల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలను పరామర్శిస్తారని తెలిపారు. తరువాత మధ్యాహ్నం రెండు గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్ బయలుదేరి వెళతారన్నారు. విలేకరుల సమావేశంలో దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పాల్గొన్నారు.

చోడవరం బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

- విద్యార్థుల ముందు పార్టీ వ్యవహారంపై ఉన్నతాధికారులు చర్యలు

- 7లో

అమర్‌నాథ్ కంటతడి

» అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ పరిచయ కార్యక్రమంలో భావోద్వేగానికి గురైన మంత్రి

» ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి వేరొకరిని సమన్వయకర్తగా నియమించిన వైసీపీ అధిష్ఠానం



సమావేశంలో కంటతడి పెట్టిన మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, జనవరి 4: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భావోద్వేగానికి లోనయ్యారు. కంటతడి పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..ప్రస్తుతం ఆయన అనకాపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం వైసీపీ అధిష్ఠానం అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా మలసాల భరత్‌కుమార్‌ను నియమించింది. అమర్‌నాథ్‌కు ఇంకా ఏ నియోజకవర్గం కేటాయించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన మలసాల భరత్ పరిచయ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఉద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. అనకాపల్లి ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని, ఆప్యాయతను మరిచిపోలేక బాధను దిగమింగుకుంటున్నానన్నారు. తల్లిదండ్రులు తనకు జన్మనిస్తే, అనకాపల్లి ప్రజలు రాజకీయ పునర్జన్మను ఇచ్చారన్నారు. గుడివాడ కుటుంబం పేరు చిరస్థాయిగా గుర్తుండిపోయే విధంగా అనకాపల్లి ప్రజలు తనను ఆదరించారన్నారు. తనను మాదిరిగా వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి పార్టీ సమన్వయకర్తగా నియమితులైన మలసాల భరత్‌కుమార్‌ను కూడా ఈ ప్రాంత ప్రజలు ఆదరించాలని మంత్రి కోరారు. తనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏ బాధ్యత అప్పగిస్తే దానిని నిర్వహిస్తానన్నారు. ఆయన ఆదేశాల మేరకు తాను పనిచేయాల్సి ఉంటుందన్నారు. కాగా, అమర్‌నాథ్ ఎలమంచిలి, చోడవరం, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ చేయాలని అమర్‌నాథ్ భావిస్తున్నారు. ఆయన ప్రయత్నాలు ఎంతవరకూ ఫలిస్తాయో చూడాలి. ఆయన్ను అనకాపల్లి లోక్‌సభ స్థానానికి పోటీ చేయించే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఫ్లైయాష్ లారీల అడ్డగింత

ధూళి ఎగుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని పైడివాడఅగ్రహారం ప్రజలు ఆవేదన

» భారీ వాహనాల వల్ల రహదారి ధ్వంసమైందని ఆగ్రహం

» సుమారు గంట సేపు రోడ్డుపై బైఠాయింపు

» పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమణ



పైడివాడఅగ్రహారం వద్ద ఫ్లైయాష్ లారీలను అడ్డుకున్న గ్రామస్థులు



అసకపల్లి- లంకెలపాలెం రోడ్డుపై ముద్దలుగా పడి ఉన్న ఫ్లైయాష్

సబ్బవరం, జనవరి 4: మండలంలోని లంకెలపాలెం రోడ్డులో ఫ్లైయాష్ రవాణా చేస్తున్న లారీలను పైడివాడఅగ్రహారం ప్రజలు గురువారం అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. పలు మార్లు స్థానిక అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మహిళలు మాట్లాడుతూ సుమారు రెండేళ్లుగా అసకపల్లి-లంకెలపాలెం రోడ్డులో పరవాడ ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. అయితే పరిమితికి మించిన లోడుతో పాటు అధిక వేగంగా లారీలు, డంపర్లు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని చెప్పారు. దీనికి తోడు ఫ్లైయాష్ తరలించే లారీలు టార్పాలిన్లు కప్పకపోవడంతో ముద్దలు ముద్దలుగా ఫ్లైయాష్ రోడ్డుపై పడుతోందని తెలిపారు. దీని వల్ల ఫ్లైయాష్ ధూళి ఎగసి అసకపల్లి, ఎరుకు నాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నెల రోజులు క్రితం ఇలాగే వాహనాలను అడ్డుకుంటే రోడ్డుపై నీళ్లు జల్లుతున్నారని, అయినా ఫలితం లేదన్నారు. రోడ్డుపై జారిపడ్డ ఫ్లైయాష్‌పై నీరు చల్లడం వల్ల రోడ్డంతా బురదగా మారి ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పైడివాడఅగ్రహారం వాసులు సుమారు గంట సేపు వాహనాలను అడ్డుకోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి వాహనాల రాకపోకలకు క్రమబద్ధీకరించారు.

హామీలు విస్మరించడం సీఎంకు తగదు

» ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణ

అనకాపల్లి రూరల్, జనవరి 4: ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకపోవడం సీఎం జగన్మోహన్‌రెడ్డికి తగదని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణ అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరింది. కొండకొప్పాకలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద ఉద్యోగులు శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం రెండు వారాల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పైగా సమ్మె చేస్తున్న ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తామంటూ నోటీసులు జారీ చేసి బెదిరింపులకు దిగడం బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని, లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో వైసీపీ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. విద్యా శాఖ ఉన్నతాధికారులతో కుమ్మక్కై కేజీబీవీ ఉద్యోగుల బెదిరింపులకు కారణమైన కేజీబీవీ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకురాలు ఎస్.దేవిని యూనియన్ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 15 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా ఆర్.వరలక్ష్మి, కార్యదర్శిగా పద్మావతి ఎన్నికయ్యారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలు నాశనం

» బీసీలను దగా చేస్తున్న సీఎం జగన్ » ఉత్సవ విగ్రహాలుగా కార్పొరేషన్లు

» బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరామమూర్తి విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈర్లె శ్రీరామమూర్తి

చోడవరం, జనవరి 4: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి విమర్శించారు. గురువారం పట్టణంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, కానీ కార్యాలయాల నిర్వహణకు కూడా నిధులు ఇవ్వకుండా బీసీలను వంచించిందని ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీసీ అధికారులను కూడా ఈ ప్రభుత్వం దగా చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన పోస్టుల్లో సీఎం జగన్ తన సామాజికవర్గం వారి నియమించుకుంటున్నారని, బీసీ అధికారులను ప్రాధాన్యం లేని పోస్టులకు పరిమితం చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాలపై ఈనెల 7న విశాఖలో నిర్వహిస్తున్న బీసీ గర్జన సభలో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు కందర్ప రమణమూర్తి, కొప్పాక భాస్కరరావు, వెంకటరావు, నారాయణరావు, దట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

రుషీల్ డెకార్ పరిశ్రమలో ప్రమాదం

» ఎలక్ట్రికల్ ఇంజనీర్ మృతి



మనీష్ మృతదేహం

అచ్యుతాపురం/రాంబిల్లి, జనవరి 4: సెజ్‌లోని రుషీల్ డెకార్స్ కర్మాగారంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ మృతి చెందారు. మధ్యప్రదేశ్‌కి చెందిన మనీష్(30) ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడ. గురువారం తెల్లవారుజాము మూడున్నర గంటల ప్రాంతంలో విధి నిర్వహణలో ఉండగా కన్వేయర్ బెల్టులో ఆయన చెయ్యి ఉండిపోయింది. బెల్టుతో పాటు మనీష్ కూడా రోలర్ కిందకు వెళ్లిపోయారు. కుడిచేయి పూర్తిగా నలిగిపోవడంతో పాటు తీవ్రగాయాలపాలై ఆయన మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. కాగా కర్మాగారాల్లో సరైన భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము ఆరోపించారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు పరిహారంతో పాటు సమగ్ర విచారణ జరిపి కర్మాగారం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

ఎలమంచిలి, జనవరి 4: మండలంలోని లైనుకొత్తూరు గ్రామంలో ఇంటి వద్ద పార్కింగ్ చేసిన తన బైక్ చోరీకి గురైనట్టు బాధితుడు ఎన్.విజయ్‌కుమార్ గురువారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి రూరల్ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

మహిళను గాయపరిచిన వ్యక్తిపై ఫిర్యాదు

ఎలమంచిలి, జనవరి 4: మునిసిపాలిటీలోని కొత్తపాలేనికి చెందిన ఓ మహిళను గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి రూరల్ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపాలేనికి చెందిన లక్ష్మిని సోమలింగపాలేనికి చెందిన ఎ.జగన్నాథరావు గురువారం బైక్‌పై తీసుకువెళుతుండగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆమెను అతను చేతితో గుద్దడంతో అదుపుతప్పి వాహనం పైనుంచి పడి గాయాలపాలైంది. ఈ మేరకు ఆమె కుమారుడు గణేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోడవరం బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

చోడవరం, జనవరి 4: పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థుల మందు పార్టీ వ్యవహారంలో వార్డెన్ బి.చిన్నయ్యను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి బీసీ హాస్టల్‌కు చెందిన కొంతమంది విద్యార్థులు, పక్కనే నిర్మాణంలో వున్న ఒక భవనంలో బీరు, బిర్యానీలతో పార్టీ చేసుకున్న ఘటన సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించడంతోపాటు, సమగ్ర దర్యాప్తు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు ఆదేశించారు. దీంతో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు పూర్తి వివరాలు సేకరించారు. వీరు ఇచ్చిన నివేదికల ఆధారంగా హాస్టల్ వార్డెన్ చిన్నయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, వారి పిల్లల పరిస్థితి గురించి వివరించినట్టు తెలిసింది.

ఇద్దరు కేజీబీవీ ఉద్యోగులను తొలగిస్తూ ఉత్తర్వులు

అనకాపల్లి రూరల్, జనవరి 4: జిల్లాలో ఇద్దరు కేజీబీవీ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ డీఈవో కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అచ్యుతాపురం మండలంలోని కేజీబీవీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న పి.జయంతి, పీఈటీ దేవరపు దేవిరాణి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొంటున్నారు. దీనిపై వివరణ కోరుతూ డీఈవో కార్యాలయం నుంచి ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరు ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని అధికారులు.. విధుల నుంచి తొలగిస్తూ టెర్మినేషన్ ఉత్తర్వులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

ఘనంగా శ్రీవారి తిరువీధి సేవ



మాఢవీధుల్లో ఊరేగుతున్న ఉపమాక వెంకన్న (ఇన్‌సెట్‌లో) స్వామివారు

నక్కపల్లి, జనవరి 4: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం కన్నుల పండువగా స్వామివారి తిరువీధి సేవ నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉభయదేవేరులతో కూడిన స్వామిని రాజాధిరాజ వాహనంపై, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు.

కిరండోల్ రైలుకు అదనపు విస్టోడమ్ కోచ్

విశాఖపట్నం, జనవరి 4: పర్యాటకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు శుక్రవారం నుంచి ప్రత్యేక తేదీల్లో అదనంగా ఒక విస్టోడమ్ కోచ్‌ను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే 08551 నంబరు గల రైలుకు ఈనెల 5, 6, 7, 12, 14, 19, 20, 21, 26, 27, 28 తేదీల్లో....కిరండోల్ నుంచి విశాఖ వచ్చే 08552 నంబరు గల రైలుకు ఈనెల 6, 7, 8, 13, 15, 20, 21, 22, 27, 29 తేదీల్లో అదనపు విస్టోడమ్ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

యువత ఉపాధి కోసం సీఐపీఈటీతో సింహాద్రి ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తదితరులు

పరవాడ, జనవరి 4: నిర్వాసిత గ్రామాల్లో గల యువతకు ఉపాధి కల్పించేందుకు సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం విజయవాడకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీస్ (సీఐపీఈటీ) సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. మెషిన్ ఆపరేటర్ - ఇంజెక్షన్ మెయిలింగ్, మిషన్ ఆపరేటర్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్‌పై యువతకు ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. రెండు బ్యాచ్‌లుగా విభజించి బ్యాచ్‌కు 30 మందికి శిక్షణ ఇస్తామన్నారు. ఈ మేరకు గురువారం సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్. శేఖర్‌తో సింహాద్రి జీజీఎం, ఇతర అధికారులు కలిసి ఒప్పందం కుదుర్చుకుని సంతకాలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి కూడా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి హెచ్ఆర్ హెడ్ టీబీ పాత్ర, సీఎస్ఆర్ విభాగం ప్రతినిధులు కె.ప్రకాశరావు, శివం ప్రతాప్‌సింగ్, సీపీఈటీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, జనవరి 4 : పారిశుధ్య కార్మికుల సమ్మె గురువారంతో పదో రోజుకు చేరుకుంది. జీవీఎంసీ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిన భానుమూర్తి యాదవ్, మలపురెడ్డి కోటేశ్వరరావు హాజరై సంఘీభావం తెలిపారు. అలాగే శిబిరం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు మాట్లాడుతూ కార్మికులు పది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో స్పందన కనిపించకపోవడం విచారకరమన్నారు.

ఉద్యోగులకు నాణ్యమైన భోజనం

» బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి


మహిళా కార్మికులకు భోజనాలు వడ్డిస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, జనవరి 4: తమ కర్మాగారంలో పనిచేసే ఉద్యోగులకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందిస్తున్నామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి అన్నారు. గురువారం బ్రాండిక్స్ కర్మాగారం ఆవరణలోని కిచెన్‌లో ఆహార నాణ్యతని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు నాణ్యమైన భోజనం కోసం అక్షయపాత్రకు అప్పగించామన్నారు. అక్షయపాత్ర సిబ్బంది ఇక్కడ వండి ఉద్యోగులకు భోజనాన్ని అందజేస్తున్నారన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులకు వడ్డించడంతో పాటు వారితో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.భక్తదాస ప్రభు, బ్రాండిక్స్-3 సిబ్బంది పాల్గొన్నారు.

అభిజిత్ కార్మికులకు పూర్తిస్థాయిలో పనులు చేయించాలి : సుందరపు

అచ్యుతాపురం, జనవరి 4: అభిజిత్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికులకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని జనసేన నేత సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం కర్మాగారం ముందు ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఆయన కలిసి మద్దతు తెలిపారు. కర్మాగారం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్న నెపంతో కాంట్రాక్ట్ కార్మికులకు 15 రోజులే పనులు కల్పిస్తామని యాజమాన్యం ప్రకటించడం శోచనీయమన్నారు. పనిచేసిన కాలానికే దినసరి కూలి ఇస్తామని ప్రకటించడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన శ్రేణులు పాల్గొన్నాయి.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రాము



ఎలమంచిలి, జనవరి 4: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పెదపూడి రామును నియమించారు. తనకు ఈ పదవిలో నియమించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

ఎస్. రాయవరం, జనవరి 4: మండలంలోని కొరుప్రోలు జడ్పీ హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో అవార్డు పొందిన రఘు రమేశ్‌ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎస్ ధర్మారావు సత్కరించారు. గురువారం ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మారావు మాట్లాడుతూ.. తమ సంఘం ఉపాధ్యాయ సంక్షేమంతో పాటు విద్యారంగం అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, హెచ్ఎం ఎస్. సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె. శ్రీనివాస్, జి సునీల్ పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాలో శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ సేవలు

» ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎండీ సంజయ్ ప్రకాష్

మునగపాక, జనవరి 4 : రైతుల ప్రయోజనాల కోసం జిల్లాలో మొదటిగా శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ మొబైల్ వెటర్నరీ సర్వీసెస్ యూనిట్‌ను ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎండీ సంజయ్ ప్రకాష్ గురువారం ప్రారంభించారు. అరబుపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశువైద్య బృందం ఈ ప్రత్యేక వాహనంలో రైతుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఇండియన్ వెటర్నరీ సైన్సెస్ పితామహుడు శాలిహోత్ర గౌరవార్థం ఈ ఎక్స్‌ప్రెస్‌కు ఆయన పేరు పెట్టడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి బి. ప్రసాదరావు, ఎస్.గోపాలరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి

కశింకోట, జనవరి 4 : ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే 193వ జయంతిని స్థానిక పీహెచ్‌సీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తిరుపతిరావు, ఆశ వర్కర్లు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీహెచ్ఓలు సత్యనారాయణ, పరమానందరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డీడీ.వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ బీసీ ప్రచారరథం ప్రారంభం

ఎలమంచిలి, జనవరి 4 : బీసీల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ చేపట్టిన విధి విధానాలను ప్రజలకు వివరించేందుకు ప్రతీ నియోజకవర్గానికి ఒక బీసీ ప్రచార రథాన్ని టీడీపీ కేటాయించింది. ఈ ప్రచార రథాన్ని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు గురువారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీను, జిల్లా కన్వీనర్ సబ్బి శ్రీను పాల్గొన్నారు.

ఎట్టకేలకు టిడ్కో ఇళ్లు ప్రారంభం


టిడ్కో గృహ సముదాయాలను ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

కొత్తూరు, జనవరి 4: అనకాపల్లి మండలం సత్యనారాయణపురం టిడ్కో గృహ సముదాయాలను ఎట్టకేలకు ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 2.5లక్షల టిడ్కో గృహాల నిర్మాణాలు చేపట్టి మౌలిక సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు అందజేశామన్నారు. అనకాపల్లి సమన్వయకర్తగా నియమించిన మలసాల భరత్‌కుమార్‌ను ప్రజలంతా ఆదరించి ఆయన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో సదుపాయాలు లేకుండా, నిర్మాణాలు పూర్తి కాకుండా హడావుడిగా గృహ ప్రవేశాలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో భాగంగా టిడ్కో గృహ నిర్మాణాలను కేవలం ఒక్క రూపాయికే 12 లక్షల విలువ చేసే ఇంటిని అందజేశామన్నారు. ఈ ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు ఇచ్చామన్నారు. కొత్తూరు పంచాయతీలో టీటీడీ కళ్యాణమండపం పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు టిడ్కో గృహాల తాళాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి అసెంబ్లీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కార్పొరేటర్లు మందపాటి సునీత, పీలా లక్ష్మీసౌజన్య, టిడ్కో ఎస్ఈ నరసింహమూర్తి, ఈఈ సుధాకర్, డీఈఈ సంధ్య పాల్గొన్నారు.

నియంత పాలనలో సమస్యలు పరిష్కారం కావు..పోరాటం చేయాల్సిందే..

అంగన్‌వాడీలతో జనసేన నేత సుందరపు విజయకుమార్


అంగన్‌వాడీలకు సంఘీభావంగా ఆందోళనలో కూర్చున్న సుందరపు, జనసేన నేతలు

అచ్యుతాపురం, జనవరి 4: నియంత పాలనలో సమస్యలు పరిష్కారం కావని, అయినా హక్కుల కోసం పోరాడాలని జనసేన నేత సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా సమస్యలపై ఆందోళన చేస్తే ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరుపుతుందని, కాని వైసీపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరడంలో తప్పు లేదన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు, లాలం చందు, సైల రామునాయుడు, మోటూరు శ్రీవేణి, రేఖ అప్పలరాజు, పవన్ విజయ్, శరగడం నాగార్జున పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్‌లో.. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా గురువారం నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీలు 24 రోజులుగా సమ్మె చేస్తున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పరిసర ప్రాంతాల్లోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పరవాడలో.. అంగన్‌వాడీల సమ్మె గురువారం నాటికి 24వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంగన్‌వాడీలకు వ్యతిరేకంగా ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ ప్రతులను దహనం చేశారు.

సబ్బవరంలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారం 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు వీవీ రమణమ్మ మాట్లాడుతూ.. 23 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం సోచనీయమన్నారు.

రాంబిల్లిలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం న్యాయం చేసేంతవరకు తాము ఆందోళన విరమించేది లేదని అంగన్‌వాడీలుస్పష్టం చేశారు.


పరవాడలో సర్క్యులర్ ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

కోటవురట్లలో.. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు జానకిశ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేచలపు జనార్దన్, తిరుమలరావు, రాజుపేట సర్పంచ్ రమణ, సుంకర్‌బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి


అనకాపల్లిలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 4 : స్థానిక సీబీటీయూ కార్యాలయంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. విజువల్లి చాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డ్వామా అడిషనల్ పీడీ ఎం. రోజారాణి మాట్లాడుతూ మానసిక శక్తిని మించింది మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి పి. పోతురాజు, కోశాధికారి కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో.. స్థానిక భవిత కేంద్రంలో గురువారం అంధుల పితామహుడు లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంధుల సమాఖ్య జిల్లా యూనిట్ అధ్యక్షుడు అర్జునరావు, ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్‌రావు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం టీచర్లు కుమారి, శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని గొడిచెర్ల హైస్కూల్‌లో గురువారం లూయి బ్రెయిల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ పాఠశాలలో ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ పర్యవేక్షణ, శిక్షణలో టెన్త్‌లో 295 మార్కులు సాధించిన అంధ విద్యార్థిని సింహాచలంను హెచ్ఎం ప్రతాప్‌రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.నరేశ్ మాట్లాడుతూ.. చదువుకు అంధత్వం అడ్డుకాదని యాస్మిన్ నిరూపించిందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు


మునగపాకలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

మునగపాక, జనవరి 4: స్థానిక నందీశ్వర కళా ప్రాంగణంలో గురువారం వృద్ధులకు ఎమ్మెల్యే కన్నబాబు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పి. స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. స్థానిక మండల కార్యాలయాల ప్రాంగణంలో పింఛన్లను ఎమ్మెల్యే కన్నబాబురాజు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, నాయకులు లాలం రాము, కోన బుజ్జి, దేశంశెట్టి శంకరరావు, నర్మాల కుమార్, పిన్నమరాజు వాసు తదితరులు పాల్గొన్నారు.,

సబ్బవరంలో.. స్థానిక మండల పరిషత్తు ఆవరణలో గురువారం పింఛన్లను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పంపిణీ చేశారు. అంతకుముందు ఆయన దుర్గమాంబ సొసైటీలో ధాన్యం కొనుగోలు, షాపింగ్ కాంప్లెక్స్, సీసీ రోడ్డు, ఎంపీడీవో కార్యాలయ ఆర్చిని ఎమ్మెల్యే అదీప్‌రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్‌ఎంపీపీ చొక్కాకుల గోవింద, ఎంపీడీవో రమేశ్‌నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శేషుబాబు, నేతలు బోకం రామునాయుడు, పి సురేష్‌రాజ్ పాల్గొన్నారు.

పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జోగులు


ఎమ్మెల్యే కంబాల జోగులను సన్మానిస్తున్న బొలిశెట్టి గోవిందరావు, వైసీపీ నేతలు

ఎస్.రాయవరం, జనవరి 4: పాయకరావుపేట వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే జోగులు వైసీపీ మండల నాయకులను పరిచయం చేసుకొని తనకు సహకరించాలని కోరారు. నూతన ఇన్‌చార్జి జోగులను మండల అధ్యక్షుడు గోవిందరావు, ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో జగన్ వెంటే ఉంటా : జోగులు

కోటవురట్ల, జనవరి 4: రాజకీయాల్లో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం ఎంపీపీవో ఆవరణలో పెంచిన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మూడోసారి తనకు ఇక్కడ అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, సీతబాబు, ఎంపీపీ అప్పలనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

ఆడారి తులసీరావుకు ఘన నివాళి

ఎలమంచిలి, జనవరి 4 : విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు ప్రథమ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తులసీనగర్‌లో తులసీరావు చిత్రపటం వద్ద కుటుంబ సభ్యులు, అభిమానులు, పాడి రైతులునివాళులర్పించారు. రైతులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మళ్ల కొండబాబు, ఆడారి వెంకట్, ఆడారి పూరి జగన్నాథం, యల్లపు అయోధ్య నాగరాజు, కర్రి జానకీరామ్ పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి : ఈఆర్ఓ

ఎలమంచిలి, జనవరి 4: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సన్నద్ధంగా ఉండాలని ఈఆర్‌వో మనోరమ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గంలోని సెక్టార్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని అంశాలను ఇప్పట్నుంచే పరిశీలన చేసుకోవాలన్నారు. సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి కేటాయించిన పీఎస్‌లను పరిశీలన చేసుకోవాలన్నారు. ఈనెల 12వ తేదీ వరకూ ఫారమ్ 6, 7, 8 లు స్వీకరించే సమయం పొడిగించారన్నారు. ఇప్పట్నుంచే జిల్లా కలెక్టరు ఆదేశానుసారం విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధానాలపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాణిఅమ్మాజీ, ఎంపీడీఓ కొండబాబు పాల్గొన్నారు.

జగనన్న భూ రక్షణ పథకం పాస్ పుస్తకాలు రద్దు చేయాలి

ఎలమంచిలి, జనవరి 4 : జగనన్న భూరక్షణ పథకం పాస్ పుస్తకాలు రద్దు చేయాలని కోరుతూ గురువారం ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై సీపీఐ పార్టీ నేతలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్ జంక్షన్ నుంచి దిమిలి రోడ్డు జంక్షన్ వరకూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు పాల్గొన్నారు.

కశింకోట యుపిఎస్ సీఐగా వినోద్‌బాబు నియామకం

కశింకోట, జనవరి 4: జిల్లాలో అప్‌గ్రేడ్ అయిన కశింకోట యుపీఎస్ పోలీసు స్టేషన్‌కు నూతన సీఐగా వినోద్‌బాబును నియమిస్తూ విశాఖపట్నం రేంజ్ ఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సీఐగా పనిచేస్తున్న ఎం. వినోద్‌బాబును ఇక్కడకు బదిలీ చేశారు.

ఓటర్ల వినియోగంపై అవగాహన

ఎస్.రాయవరం, జనవరి 4: మండలంలోని పెదగుమ్ములూరులో గురువారం ఓటు వినియోగంపై ఓటర్లకు డిప్యూటీ తహసీల్దార్ వై.శ్యామ్ అవగాహన కల్పించారు. ఎవరైన ఓటు వినియోగించుకోకపోతే అటువంటి వారి ఓట్లను దుర్వినియోగం చేయడానికి ప్రయత్నాలు చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో వి శ్రీధర్, బీఎల్‌వోలు హధాస్సా పాల్గొన్నారు.

వైసీపీ 'పేట సమన్వయకర్తకు చేదు అనుభవం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరారు. గ్రామ శివారులో సీతబాబు కుమారుడు నారాయణమూర్తిరాజు, వారి అనుచరులు కలిసి ఎమ్మెల్యే జోగులు కారును ఆపారు. ఆయనను కిందకు దించి, తమ కారులో ఎక్కించుకుని నేరుగా సీతబాబు ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న సూర్యనారాయణరాజు, ఎమ్మెల్యే జోగులకు ఫోన్ చేశారు. తొలుత తన నివాసానికి వస్తానని చెప్పి అక్కడికి (సీతబాబు ఇంటికి) ఎలా వెళ్లారని ప్రశ్నించారు. దీంతో జరిగిన విషయాన్ని జోగులు ఆయనకు వివరించి 15 నిమిషాల్లో మీ ఇంటికి వస్తానని చెప్పారు. కానీ ఇది సరైన పద్ధతి కాదంటూ సూర్యనారాయణరాజు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సీతబాబు ఇంటివద్ద కార్యకర్తల పరిచయం అనంతరం జోగులు కారులో బయలుదేరి సూర్యనారాయణరాజు ఇంటికి వచ్చారు. అప్పటికే అక్కడ వున్న కార్యకర్తలు, నాయకులు.. ఇక్కడికి రావద్దు అంటూ పెద్దగా నినాదాలు చేశారు. సూర్యనారాయణరాజు కార్యకర్తలకు నచ్చజెప్పి జోగులును ఇంటిలోకి తీసుకెళ్లారు. సుమారు అర గంట తరువాత ఎమ్మెల్యే జోగులు తన కారులో సూర్యనారాయణరాజును ఎక్కించుకుని పింఛన్ల పంపిణీ కోసం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు.

ఘరానా దొంగ అరెస్టు

... 5వ పేజీ తరువాయి

తరలించారు. అదే నెల 21న సెంట్రల్ జైలు నుంచి విజయనగరం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి అక్కడ కోర్టుకు తీసుకువెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేయడానికి హోటల్‌కు వెళ్లారు. నూకరాజు మరోసారి తప్పించుకుని పారిపోయాడు. ఈనేపథ్యంలో పరవాడ పోలీసులు గురువారం లంకెలపాలెం జంక్షన్‌లో నూకరాజును పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఇతని నుంచి 22 తులాల బంగారు ఆభరణాలు, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. సుమారు ఇరవైచోట్ల చోరీలకు పాల్పడిన నూకరాజును పట్టుకోవడంలో చురుకైన పాత్ర పోషించిన సీఐ ఈశ్వరరావు, క్రైమ్ టీమ్ ఏఎస్ఐ డీవై నాయుడు, సీసీఎస్ ఎస్ఐ పి.రమేశ్, ఏఎస్ఐ ప్రదీప్‌కుమార్, కానిస్టేబుళ్లు నాగేంద్ర, జీజీవీఎస్ నాయుడు, ఎం.దివాకర్‌బాబు, జి. మోహన్, ప్రసాద్‌లకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా మెడల్స్ అందజేస్తామని అదనపు ఎస్పీ (క్రైమ్) పి.సత్యనారాయణరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు వున్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

» జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

ఎస్. రాయవరం, జనవరి 4: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా ఉపవిద్యాశాఖాధికారి పి. అప్పారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి, టెస్టులు నిర్వహించాలని సూచించారు. అలాగే పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటు చాలా శక్తివంతమైనది

» ఈఆర్వో రామలక్ష్మి

నక్కపల్లి, జనవరి 4: రాజ్యాంగం కల్పించిన ఓటు చాలా శక్తివంతమైనదని, 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటర్లుగా చేరాలని ఈఆర్‌వో రామలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం రాజయ్యపేటలో ఓటు నమోదు ప్రక్రియపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. స్థానికంగా వున్న బీఎల్‌వోలను సంప్రదించి ఓటు హక్కులేని అర్హులు ఓటర్ల సభ్యత్వాలను పొందాలన్నారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబేడ్కర్, డీటీ నీరజ, సెక్రటరీ రాజశేఖర్ పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ ధర్నా

అనకాపల్లి టౌన్, జనవరి 4 : పేదల భూములను కార్పొరేట్‌లకు కట్టబెట్టే 27/2023 భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ సీపీఐ నాయకులు నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని ఏ రాష్ట్రంలో అమలు చేయకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ చట్టం వల్ల చిన్న, సన్నకారు, పేద రైతులు తమ భూములను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే పేదల భూములకు రెవెన్యూ వ్యవస్థ వల్ల రక్షణ లేకుండా పోయిందన్నారు. దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన చట్టం ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాకాశి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరిబిల్లి శంకరరావు, చెల్లూరి నాగరాజు, ఆర్. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

అనకాపల్లి టౌన్, జనవరి 4 : స్థానిక విజయరామరాజుపేటలో గురువారం పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు బుద్ద సోమేశ్వరరావు, కార్యదర్శి బొడ్డేడ కాశీ, మాజీ అధ్యక్షుడు ఎఎస్ నాయుడు, దాడి జగన్, దొడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

పరవాడ, జనవరి 4: పరవాడ పెద్దచెరువులో చేపలు మృత్యువాత పడటానికి కారణమైన రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెద్ద చెరువు ఆయకట్టు రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ చేపడుతున్న నిరసన దీక్షలు గురువారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన గనిశెట్టి మాట్లాడుతూ రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పైలా అప్పారావు, శ్రీను, నాయుడు, ఎస్ఎస్ నాయుడు, రామునాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చండీయాగం

అనకాపల్లి టౌన్,జనవరి 4 : స్థానిక గవరపాలెం గంగపరదేశమ్మ భవానీ భక్తుల ఆధ్వర్యంలో జరుగుతున్న కనకదుర్గమ్మ అమ్మవారి చండీయాగ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, జాతర కళాకారులు, వివిధ దేవతామూర్తుల నృత్య ప్రదర్శనలతో గంగిరేవిచెట్టు వద్ద నుంచి ఊరేగింపు పురవీధుల గుండా సాగింది. అనంతరం శారదానదిలో అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీరామ్, మద్దాల శ్రీను, కె.వెంకట్, యుగంధర్, గంగాధర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి టీడీపీ అధికారంలోకి రావాలి

కశింకోట, జనవరి 4: ఏపీ అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.బాబర్ అన్నారు. మండలంలోని బయ్యవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులతో రిజిస్ట్రేషన్ చేయించారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ఆడవారికి ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా వస్తామని, రైతులకు రూ.20 వేలు ఏడాదికి ఇస్తామన్నారు. కుటుంబంలో ఎంత మంది విద్యార్థులుంటే వారికి రూ.15వేలు చొప్పున నగదు, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి కల్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

కొత్తూరు, జనవరి 4 : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో పూర్వ విద్యార్థులు, మేము సైతం సమాజం కోసం అనే సేవా సంస్థ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం జరిగింది. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 122 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. దీనిని అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రి, రెడ్‌క్రాస్ ఇండియా సొసైటీకి అందజేస్తామని ప్రిన్సిపాల్ జి. జయబాబు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ మహేశ్వరరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ టి.నిరంజన్‌కుమార్, సూపరింటెండెంట్ పి.అనురాధ, గవర్నింగ్ బాడీ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపరాల సాగుపై రైతులకు శిక్షణ

రాంబిల్లి, జనవరి 4 : మామిడివాడ రైతుల భరోసా కేంద్రంలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అపరాల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిపురం బీసీటీ కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వానాప్రసాద్‌రావు అపరాలు సాగులో విత్తన నమోదు, ఎరువులు, నీటి యాజమాన్యం, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. అనకాపల్లి రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి విజేత చిరుధాన్యం పంటల్లో విత్తన నమోదు, యాజమన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో సి.సుమంత, గ్రామ సర్పంచ్ మట్ట అప్పలనర్స, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, రైతులు పాల్గొన్నారు.

'ఆటో కార్మికుల కడుపు కొట్టడం అన్యాయం'

తుమ్మపాల, జనవరి 4 : రాష్ట్రంలో స్వార్థ రాజకీయాల కోసం ఉచిత పథకాలు పెట్టి కార్మికుల పొట్ట కొట్టడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోన లక్ష్మణ ఆరోపించారు. గురువారం పట్టణంలోని రింగురోడ్డు వద్ద ఆటో కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకున్నా ఉద్యోగాలు లేక ఆటోలు వేసి జీవనం సాగిస్తున్న నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉచితం పేరుతో బస్సులను నడిపిస్తుండడంతో ఆటో కార్మికుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కె. మాణిక్యం, శ్రీను, వెంకటరమణ, గోవిందరాజు పాల్గొన్నారు.

వామనావతారంలో పాండురంగడు

పాయకరావుపేట, జనవరి 4: స్థానిక రాధారుక్మిణి సహిత పాండురంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం పాండురంగస్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి పాండురంగస్వామివారిని వామనరూపుడుగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్.వెంకటాద్రి తదితరులు, అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి తరించారు.

పెదకలవలాపల్లి రైతుల సమస్యలు పరిష్కరించాలి

రాంబిల్లి, జనవరి 4: మండలంలోని పెదకలవలాపల్లి ఎన్ఏఓబీ నిర్వాసిత రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పూడిమడక ఎంపీటీసీ సభ్యుడు ఎం. అప్పలనాయుడు కోరారు. పెదకలవలాపల్లిలో 70 రోజులుగా గ్రామస్థులు చేస్తున్న నిరసన శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయం చూపించకుండా ప్రహరీగోడను నిర్మిస్తుండడం అన్యాయమన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే



మహిళకు పెన్షన్ మంజూరు పత్రం అందిస్తున్న గణేశ్

గొలుగొండ , జనవరి 4 : రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు ఎమ్మెల్యే గణేశ్ తెలిపారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పలువురికి పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి డి.మోహన్‌రావు, ఎంపీపీ గజ్జలపు వణికుమారి, జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, ఎంపీడీవో డేవిడ్‌రాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సీహెచ్.భాస్కరనాయుడు, వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి, ఆదినారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న భూహక్కు, భూ రక్ష'ను రద్దు చేయాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ నాయకుల ధర్నా

నర్సీపట్నం అర్బన్, జనవరి 4 : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు మేకా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకం వల్ల ప్రజల ఆస్తి కోట్లాది రూపాయలు దుర్వినియోగం జరిగిందే తప్ప, రైతులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ప్రజల ఆస్తికి భద్రత లేని ఇటువంటి కార్యక్రమాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఐ నాయకులు గురుబాబు, ఎల్‌వీ రమణ, జి.రాధాకృష్ణ, మేకా భాస్కరరావులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

» అధికారుల అవగాహన సదస్సులో ఏఎస్పీ రాణా





సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ అదీప్‌రాజ్ సింగ్ రాణా

నర్సీపట్నం, జనవరి 4 : ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు విధిగా ఉండాలని ఏఎస్పీ అదీప్‌రాజ్ సింగ్ రాణా తెలిపారు. ఎన్నికల విధులకు నియమించిన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు గురువారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నియమావళి, నిర్వహణపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. నియోజవర్గంలోని పోలింగ్ కేంద్రాలపై నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఉద్దేశించి అన్నారు. ఆర్డీవో హెచ్‌వీ జయరామ్ మాట్లాడుతూ ఓటరు స్వేచ్ఛగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత సెక్టార్ అధికారులపై ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ర్యాంప్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద హింసాత్మక ఘటనలు, రీపోలింగ్ జరిగిన సందర్భాలు గతంలో జరిగి ఉంటే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ పర్సంటేజ్ ఎక్కువ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిమాండ్లపై అంగన్‌వాడీలు రిలే నిరశన



ఎన్టీఆర్ స్టేడియం వద్ద రిలే దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నర్సీపట్నం, జనవరి 4 : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారానికి గత 24 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందిగా కోరారు. వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్మికుల సంఘం ప్రతినిధులు సామ్రాజ్యం, కృష్ణవేణి, శోభ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి వంద కుర్చీలు వితరణ



రాజేష్‌కు కుర్చీలు అందజేస్తున్న శెట్టిపాలెం సర్పంచ్

మాకవరపాలెం, జనవరి 4: మండలంలోని తామరం గ్రామంలో గల టీడీపీ కార్యాలయానికి శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు గురువారం వంద కూర్చీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.60వేలు సొంత నిధులతో వీటిని కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్, పార్టీ మండల శాఖ అధ్య క్షుడు ఆర్‌వై పాత్రుడుతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్, వాలీబాల్ పోటీలు

నాతవరం, జనవరి 4 : సంక్రాంతి పండగను పురస్కరించుకుని నాతవరంలో శనివారం నుంచి క్రికెట్, వాలీబాల్ పోటీలు ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు పారుపల్లి కిరణ్, శెట్టి సతీష్, పైల వెంకటరమణ తెలిపారు. గురువారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ ఔత్సాహిక క్రీడాకారులు శుక్రవారంలోగా తమ పేర్లను నమోదు చేసుకుంటే డ్రా తీస్తామన్నారు. పోటీలు ఫారెస్టు గ్రౌండ్, ప్రాథమిక పాఠశాల మైదానంలో నిర్వహించనున్నామన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు.

నేటి నుంచి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

కృష్ణాదేవిపేట, జనవరి 4 : గొలుగొండ మండలం గింజర్తి జంక్షన్‌లో గల పెట్ల నారాయణమూర్తి పొలంలో శుక్ర, శనివారాల్లో ప్రకృతి వ్యవసాయంపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు బీసీటీ సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గొలుగొండ, కొయ్యూరు మండలాల్లో ఆసక్తి గలవారు హాజరు కావాల్సిందిగా కోరారు.

అంతర్జాతీయ తెలుగు మహా సభలకు చంటిబాబు

నాతవరం, జనవరి 4 : రాజమండ్రిలో శుక్రవారం నుంచి జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలకు మండలంలోని వెంకయ్యపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అంబటి చంటిబాబుకు ఆహ్వానం అందింది. చంటిబాబు ప్రముఖ కార్టూనిస్టుగా పేరు తెచ్చుకున్నారు. గతంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా, ఉత్తమ కళాకారుడిగా రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందారు.

ఘరానా దొంగ అరెస్టు

... 5వ పేజీ తరువాయి

తరలించారు. అదే నెల 21న సెంట్రల్ జైలు నుంచి విజయనగరం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి అక్కడ కోర్టుకు తీసుకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేయడానికి హోటల్‌కు వెళ్లారు. నూకరాజు మరోసారి తప్పించుకుని పారిపోయాడు. ఈ నేపథ్యంలో పరవాడ పోలీసులు గురువారం లంకెలపాలెం జంక్షన్‌లో నూకరాజును పట్టుకుని స్టేషన్‌కు తీసుకు వచ్చి విచారించారు. ఇతని నుంచి 22 తులాల బంగారు ఆభరణాలు, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. సుమారు ఇరవైచోట్ల చోరీలకు పాల్పడిన నూకరాజును పట్టుకోవడంలో చురుకైన పాత్ర పోషించిన సీఐ ఈశ్వరరావు, క్రైమ్ టీమ్ ఏఎస్ఐ డీవై నాయుడు, సీసీఎస్ ఎస్ఐ పి.రమేశ్, ఏఎస్ఐ ప్రదీప్‌కుమార్, కానిస్టేబుళ్లు నాగేంద్ర, జీజీవీఎస్ నాయుడు, ఎం.దివాకర్‌బాబు, జి. మోహన్, ప్రసాద్‌లకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా మెడల్స్ అందజేస్తామని అదనపు ఎస్పీ (క్రైమ్) పి.సత్యనారాయణరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు వున్నారు.

వైసీపీ 'పేట సమన్వయకర్తకు చేదు అనుభవం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరారు. గ్రామ శివారులో సీతబాబు కుమారుడు నారాయణ మూర్తిరాజు, వారి అనుచరులు కలిసి ఎమ్మెల్యే జోగులు కారును ఆపారు. ఆయనను కిందకు దించి, తమ కారులో ఎక్కించుకుని నేరుగా సీతబాబు ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న సూర్యనారాయణరాజు, ఎమ్మెల్యే జోగులకు ఫోన్ చేశారు. తొలుత తన నివాసానికి వస్తానని చెప్పి అక్కడికి (సీతబాబు ఇంటికి) ఎలా వెళ్లారని ప్రశ్నించారు. దీంతో జరిగిన విషయాన్ని జోగులు ఆయనకు వివరించి 15 నిమిషాల్లో మీ ఇంటికి వస్తానని చెప్పారు. కానీ ఇది సరైన పద్ధతి కాదంటూ సూర్యనారాయణరాజు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సీతబాబు ఇంటివద్ద కార్యకర్తల పరిచయం అనంతరం జోగులు కారులో బయలుదేరి సూర్యనారాయణరాజు ఇంటికి వచ్చారు. అప్పటికే అక్కడ వున్న కార్యకర్తలు, నాయకులు.. ఇక్కడికి రావద్దు అంటూ పెద్దగా నినాదాలు చేశారు. సూర్యనారాయణరాజు కార్యకర్తలకు నచ్చజెప్పి జోగులును ఇంటిలోకి తీసుకెళ్లారు. సుమారు అర గంట తరువాత ఎమ్మెల్యే జోగులు తన కారులో సూర్యనారాయణరాజును ఎక్కించుకుని పింఛన్ల పంపిణీ కోసం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు.

చోడవరం నియోజకవర్గం

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆర్థిక సాయం



ఉద్యోగులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న టీచర్లు

రోలుగుంట, జనవరి 4 : తమ సమస్యలపై గత 20 రోజులుగా ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు మద్దతు ప్రకటించి ఆర్థిక సాయాన్ని అందించారు. నాలుగు నెలలుగా జీతాలు లేక సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులంతా రూ.31,400 గురువారం ఎంఈఓ జాన్‌ప్రసాద్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రమణ, బి.సూర్యనారాయణ, బి.రాము, శేఖర్ పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

రోలుగుంట, జనవరి 4 : ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ నూకరాజు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు. అలాగే సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఆడారి తులసీరావుకు ఘన నివాళి

బుచ్చెయ్యపేట, జనవరి 4: విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు ప్రథమ వర్ధంతి గురువారం మండలంలో 22 పాలసేకరణ కేంద్రాల్లో ఘనంగా జరిగాయి. తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పాల సంఘాల కార్యదర్శులు, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

హైవేతోనే చోడవరం అభివృద్ధి : ధర్మశ్రీ

రావికమతం, జనవరి 4: సబ్బవరం నుంచి తుని వరకు నేషనల్ హైవే రోడ్డు మంజూరుతోనే చోడవరం అభివృద్ధి ముడిపడి ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గురువారం కొత్తకోటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో 80 శాతం రోడ్లను తారు రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు.వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాడు వరకు బీఎన్ రోడ్డు అభివృద్ధికి రూ.110 కోట్లు మంజూరు చేయించానని, ఆ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, తలారి ఆదిమూర్తి, మూడెడ్ల శంకరావు పాల్గొన్నారు.



జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు

అందుకే పార్టీని వీడుతున్న ఎమ్మెల్యేలు, మంత్రులు.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు



విలేకరులతో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జనవరి 4: తుగ్లక్ పాలనతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజలు జగన్ సర్కార్‌పై తిరుగుబాటు జెండా ఎగురవేశారని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు వైసీపీని వీడుతున్నారన్నారు. 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు సొంత సీటులో పోటీ చేసేందుకు విముఖత చూపుతున్నారని, మరో 50 మంది అభ్యర్థులు పార్టీ మారే ఆలోచనలో ఉన్నారన్నారు. ప్రజలు వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని పలువురు వైసీపీని వీడుతున్నారని తాతయ్యబాబు విరుచుకుపడ్డారు. జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకోవడంతో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలను ఒక నియోజకవర్గం నుంచి మరొక నియోజకవర్గానికి మార్చుతున్నారన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతే ఇందుకు కారణమని తాతయ్యబాబు తెలిపారు. తెలుగుదేశం పార్టీతోనే సైకో పాలన నుంచి ఏపీకి విముక్తి సాధ్యపడుతుందని తాతయ్యబాబు అన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఎంవీ.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దొంకిన అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉర్లలోవ భూములను వెబ్‌ల్యాండ్‌లో పెట్టాలని గిరిజనుల ఆందోళన



నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

రావికమతం,జనవరి 4: ఉర్లలోవ రెవెన్యూలోని సాగు భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని గిరిజనులు గురువారం ఆ తోటల్లోనే అర్ధనగ్న ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకులు సోలం రాజు మాట్లాడుతూ.. మాడుగుల మండలం పరిధిలో ఉన్న ఉర్లలోవ రెవెన్యూలో రావికమతం మండలానికి చెందిన కొమిర, మత్స్యపురం, కవ్వగుంట, బుడ్డిబంద, తదితర గ్రామాలకు చెందిన 350 మంది రైతులు 40 ఏళ్లగా జీడిమామిడి తోటలు సాగు చేసుకుంటున్నారన్నారు. మాడుగుల రెవెన్యూ అధికారులు 2013లో 450 ఎకాలకు డి.పట్టాలను ఇచ్చారన్నారు. డి పట్టాలను రెవెన్యూ అధికారులు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయడం లేదని, దీనివల్ల ప్రభుత్వ రాయితీలు, రైతు భరోసా, ఈ-క్రాప్ నమోదు,పంట రుణాలు అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ గౌరవ అధ్యక్షుడు. కె.గోవిందరావు, చిప్పాడ ధర్మరాజు, తుర్రే నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : బూడి



దేవరాపల్లిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి, జనవరి 4: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాడుగుల నియోజకవర్గంలో జల జీవన్ మిషన్ ద్వారా రూ.175 కోట్లతో ఇంటింట కొళాయిలు వేస్తున్నామన్నారు. మండల కేంద్రంలో 80 లక్షలతో కల్యాణ మండపం మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, బూరే బాబూరావు, మాజీఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కర్రి సూరినాయుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బుల్లి.లక్ష్మి, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

కె.కోటపాడు, జనవరి 4: మండలంలోని వివిధ అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గానిక్ని అభివృద్ధి చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు మట్టి రోడ్లుగా ఉన్న వాటన్నింటిని తారు రోడ్లుగా మార్చానన్నారు. పది గ్రామాల్లో రూ.10.27 కోట్లతో జరిగిన 20 అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభించారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి.జగన్మోహన్, జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనూరాధ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు వినూత్న నిరసన



దేవరాపల్లిలో ఉరితాళ్లు బిగించుకొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

దేవరాపల్లి, జనవరి 4: అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా గురువారం ఉరి తాళ్లు బిగించుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మంత్రులు బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డిలతో చర్చలు మొక్కుబడిగా జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ, హెల్పర్ల వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు.

బుచ్చెయ్యపేటలో.. సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యల పరిష్కారంలో మొండి వైఖరి వీడాలని సంఘం నాయకురాలు ఎలిశెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి కోరారు.

రావికమతంలో.. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని అంగన్‌వాడీల నాయకురాలు సత్యవేణి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు.

పింఛన్లను పంపిణీ చేసిన ధర్మశ్రీ



చోడవరంలో లబ్దిదారులకు పింఛను అందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం, జనవరి 4: స్థానిక హార్టింజి అతిథిగృహం సమీపంలో గురువారం పింఛన్లను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చోడవరం నియోజకవర్గంలో అత్యధికంగా పింఛన్లు పొందుతున్నారన్నారు. నాలుగు మండ లాల్లో 47వేల మంది పింఛనుదారులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎండీవో శ్యాంసుందర్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని కోటవీధిలో వాటర్ ట్యాంకు వద్ద ఇంటింటి కొళాయిలను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శివశంకర్, ఏఈ కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో.. బుచ్చెయ్యపేటలో నూతనంగా మంజూరైన 280 మందికి పింఛన్లను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శిరీషారాణి, ఎంపీడీఓ సువర్ణరాజు, వైసీపీ మండలపార్టీ అధ్యక్షుడు జోగా కొండబాబు, బుచ్చెయ్యపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుంకర శ్రీను పాల్గొన్నారు.

భూరక్షణ పాస్ పుస్తకాలు రద్దుచేయాలి



పాస్‌పుస్తకాలు రద్దు కోరుతూ ఆందోళన చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

చోడవరం, జనవరి4: జగనన్న భూ రక్షణ పథకం కింద ఇస్తున్న పాస్ పుస్తకాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీ ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. రీ సర్వే పేరిట ప్రభుత్వం భూములను సరిగ్గా సర్వే చేయకుండానే, సీఎం బొమ్మతో ఇస్తున్న పాస్ పుస్తకాల వల్ల అనేక వివాదాలు తలెత్తుతున్నాయని రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపించారు. అసమగ్ర సర్వేతో జారీ అవుతున్న ఈ పాస్ పుస్తకాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జగనన్న ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను దహనం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆబోతుల శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు, రైతులు మల్లం వెంకటరావు, బండ అర్జున్ పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

'రికార్డులు లేకుండా వాహనాలు నడపరాదు'

మాడుగుల, జనవరి 4: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్‌లు పొందడంతో పాటు వాహనాల రికార్డులను ఉంచుకోవాలని నర్సీపట్నం అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీఆర్ మూర్తి పేర్కొన్నారు. గురువారం ఇక్కడ ప్రైవేటు వాహనాల డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు జరిగిన సమయంలో బెనిఫిట్స్ వచ్చే చాన్స్ ఉండదన్నారు. ఓవర్ స్పీడ్, మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు.

నేడు పంచాయతీరాజ్ అతిథిగృహం ప్రారంభం

మాడుగుల, జనవరి 4 : మాడుగుల శివారు తాచేరు వద్ద నూతనంగా నిర్మించిన పంచాయతీరాజ్ అతిథిగృహాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం ప్రారంభిస్తారని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. దీంతో పాటు మోదమాంబ ఆలయ సమీపంలో శీతల గిడ్డంగి, సీసీ, బీటీ రోడ్లు, ఆర్‌బీకేలు, సచివాలయాలు ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే మండలంలో ఘాటీరోడ్డు నుంచి కింతలి ఆర్అండ్‌బీ రోడ్డుకి శంకుస్థాపన చేస్తారన్నారు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం డీడీ తనిఖీ

మాడుగుల రూరల్, జనవరి 4 : మండలంలోని ఎం.కోటపాడులో నిర్వహిస్తున్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని గురువారం పశుసంవర్ధక శాఖ పాడేరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ నరసింహులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి, పనిచేసే సామర్థ్యం తగ్గుతాయన్నారు. వ్యాధి సోకిన తల్లిపాలు తాగే దూడలు మరణించే అవకాశాలు ఉన్నాయన్నారు. మాడుగుల మండలంలో 730 పశువులకు ఈ టీకాలు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజేపురం పశు వైద్యాధికారి మణి లక్ష్మణ్, పశుసంవర్ధక సహాయకుడు గోవింద్ పాల్గొన్నారు.

చీడికాడ ఎస్ఐగా నారాయణరావు



చీడికాడ, జనవరి 4: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి.నారాయణరావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న రామారావు అనకాపల్లి బదిలీ కాగా, కోటవురట్ల ఎస్ఐగా పనిచేస్తున్న నారాయణరావు ఇక్కడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ నాగేశ్వరరావుతోపాటు పోలీస్ సిబ్బంది పరిచయం చేసుకున్నారు.

ఏ.కోడూరు ఏఎస్ఐగా రమేశ్



కె.కోటపాడు, జనవరి 4: మండలంలోని ఏ.కోడూరు ఏఎస్ఐగా రమేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనకాపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన రామకృష్ణ బదిలీపై ఎలమంచిలి వెళ్లారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఐఎస్ఓ అధికారులు

రావికమతం, జనవరి 4: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఐఎస్ఓ సర్టిపై అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కార్యాలయంలో వసతులు, సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ తీరు, ఫిర్యాదుల పెట్టె, కార్యాలయం, స్టోర్ రూమ్‌లో పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు .అనంతరం తహసీల్దార్ మహేశ్వరరావు, సిబ్బందిని పలు అంశాలను అడిగారు.